ఆంధ్రజ్యోతి

బిజినెస్

హైదరాబాద్ ● బుధవారం 3 మార్చి 2021

వారానికో కుబేరుడు!

కరోనా కాలంలోనూ కాసుల పంట.. హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్ వెల్లడి

బిలియన్ డాలర్ల క్లబ్‌లోకి కొత్తగా 55 మంది భారతీయులు

ముంబై: కొవిడ్ సంక్షోభ సమయంలోనూ భారత కుబేరుల చిట్టా మరింత పెద్దదైంది. గత సంవత్సరంలో మరో 55 మంది భారతీయులు బిలియన్ డాలర్ క్లబ్‌లో చేరారు. అంటే, 2020లో సగటున వారానికో కొత్త బిలియనీర్ పుట్టుకొచ్చాడన్న మాట. మంగళవారం విడుదలైన 'హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్ 2021' ఈ విషయాన్ని వెల్లడించింది. కనీసం 100 కోట్ల డాలర్ల ఆస్తి కలిగిన వారిని బిలియనీర్ అంటారు. ప్రస్తుత మారకం రేటు ప్రకారం, మన కరెన్సీలో రూ.7,300 కోట్ల పైమాటే.

గత ఏడాది చివరి నాటికి భారత బిలియనీర్ల సంఖ్య 209కి పెరిగిందని హురున్ 10వ వార్షిక రిపోర్టు తెలిపింది. అందులో 118 మంది స్వశక్తితో కుబేరులుగా ఎదిగినవారు కాగా, మిగతా 91 మందికి వారసత్వంగా సంపద సంక్రమించింది. మొత్తం 209 మందిలో 177 మంది బిలియనీర్లు భారత్‌లోనే నివసిస్తుండగా.. మిగిలిన వారు విదేశాల్లో స్థిరపడ్డట్లు నివేదిక వెల్లడించింది. భారత్‌లోనే నివసిస్తున్న బిలియనీర్ల సంఖ్య గత ఏడాది మరో 40 మేరకు పెరిగింది. అత్యధిక మంది బిలియనీర్లున్న దేశాల జాబితాలో భారత్ మూడో స్థానాన్ని నిలబెట్టుకుంది.

10 మంది తెలుగువారు

హురున్ ప్రపంచ బిలియనీర్ల జాబితాలో 10 మంది తెలుగువారికి చోటు దక్కింది. ఇందులో ఏడుగురు ఫార్మా రంగానికి చెందిన వారే. మిగతా ముగ్గురు ఇన్‌ఫ్రా, నిర్మాణ రంగాలకు చెందినవారు. ఈ పది మంది మొత్తం ఆస్తి 2,260 కోట్ల డాలర్ల (రూ.1,65,900 కోట్లు)గా నమోదైంది.

పేరు	కంపెనీ	సంపద (రూ.కోట్లు)	ర్యాంకింగ్ భారత్	ర్యాంకింగ్ ప్రపంచ
మురళీ దివీ, కుటుంబం	దివీస్ ల్యాబ్స్	54,100	20	385
పీవీ రామ్‌ప్రసాద్ రెడ్డి, కుటుంబం	అరబిందో ఫార్మా	22,600	56	1,096
బీ పార్థసారథి రెడ్డి, కుటుంబం	హెటిరో డ్రగ్స్	16,000	83	1,609
కే సతీశ్ రెడ్డి, కుటుంబం	డాక్టర్ రెడ్డీస్	12,800	108	2,050
జీవీ ప్రసాద్, జీ అనురాధ	డాక్టర్ రెడ్డీస్	10,700	133	2,238
పీ పిచ్చి రెడ్డి	ఎంఈఐఎల్	10,600	134	2,383
జూపల్లి రామేశ్వర్ రావు, కుటుంబం	మై హోమ్ గ్రూప్	10,500	138	2,383
పీవీ కృష్ణారెడ్డి	ఎంఈఐఎల్	10,200	140	2,383
ఎం సత్యనారాయణ రెడ్డి, కుటుంబం	ఎంఎస్ఎన్ ల్యాబ్స్	9,800	143	2,530
వీసీ నన్నపనేని	నాట్కో ఫార్మా	8,600	164	2,686

మళ్లీ ముకేశే నెం.1

రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ 8,300 కోట్ల డాలర్ల (రూ.6.05 లక్షల కోట్లు) సంపదతో అత్యంత సంపన్న భారతీయుడిగా కొనసాగుతున్నారు. గత ఏడాది ఆయన వ్యక్తిగత ఆస్తి 2,400 కోట్ల డాలర్ల మేర పెరిగింది. దాంతో, ప్రపంచ సంపన్నుల జాబితాలోనూ ముకేశ్ మరో మెట్టు పైకెక్కి 8 స్థానాన్ని చేజిక్కించుకున్నారు. ఈ ఏడాది జనవరి 15న నమోదైన నెట్‌వర్త్ ఆధారంగా ర్యాంకింగ్‌లను కేటాయించినట్లు హురున్ స్పష్టం చేసింది.

- అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ సంపద గత ఏడాదిలో దాదాపు రెట్టింపై 3,200 కోట్ల డాలర్ల (రూ.2.34 లక్షల కోట్లు)కు చేరుకుంది. భారత బిలియనీర్లలో రెండో స్థానంలో నిలిచిన అదానీ.. ప్రపంచ ర్యాంకింగ్స్‌లోనూ 20 స్థానాలు ఎగబాకి 48వ స్థానానికి చేరుకున్నారు. తన సోదరుడు వినోద్ ఆస్తి సైతం గత ఏడాది 128 శాతం వృద్ధి చెంది 980 కోట్ల డాలర్లకు పెరిగింది.
- హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు శివ్ నాడార్.. 2,700 కోట్ల డాలర్ల (రూ.1.97 లక్షల కోట్లు) ఆస్తితో భారత సంపన్నుల ర్యాంకింగ్స్‌లో మూడో స్థానంలో నిలిచారు.
- గత ఏడాది మహీంద్రా గ్రూప్ అధిపతి ఆనంద్ మహీంద్రా, కుటుంబ ఆస్తి 100 శాతం వృద్ధి చెంది 240 కోట్ల డాలర్ల (రూ.17,520 కోట్లు)కు చేరుకోగా..పతంజలి ఆయుర్వేద్ సారథి ఆచార్య బాలకృష్ణ సంపద 32 శాతం తగ్గి 360 కోట్ల డాలర్ల(రూ.26,280 కోట్లు)కు పడిపోయింది.
- బయోకాన్ చీఫ్ కిరణ్ మజుందార్ షా.. భారత్‌లోని అత్యంత సంపన్న మహిళగా నిలిచింది. గత ఏడాది ఆమె ఆస్తి 41 శాతం వృద్ధి చెంది 480 కోట్ల డాలర్ల (రూ.35,040 కోట్లు)కు చేరుకుంది. గోద్రేజ్‌కు చెందిన స్మితా వీ కృష్ణా 470 కోట్ల డాలర్లు, లుపిన్‌కు చెందిన మంజు గుప్తా 330 కోట్ల డాలర్ల ఆస్తి కలిగి ఉన్నట్లు హురున్ తెలిపింది.

ప్రపంచవ్యాప్తంగా 3,228 మంది బిలియనీర్లు

గత ఏడాది వారానికి 8 మంది చొప్పున పెరుగుదల

గత సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా వారానికి 8 మంది కొత్త బిలియనీర్లు పుట్టుకొచ్చారని హురున్ వెల్లడించింది. 2020లో ప్రపంచ బిలియనీర్ల సంఖ్య మరో 412 పెరిగి 3,228కి చేరుకుందని తెలిపింది. గత ఏడాది ప్రపంచ బిలియనీర్ల మొత్తం సంపద 3.5 లక్షల కోట్ల డాలర్లు (జర్మనీ జీడీపీతో సమానం) పెరిగి 14.7 లక్షల కోట్ల డాలర్ల(చైనా జీడీపీతో సమానం)కు చేరుకుంది.

ప్రపంచంలో సంపద అంతా ధనికుల వద్దే కేంద్రీకృతమవుతున్నదనడానికి ఇదే సంకేతమని రిపోర్టు పేర్కొంది. బిలియనీర్లు అధికంగా ఉన్న దేశాల్లో చైనా అగ్రస్థానంలో నిలిచింది. గత ఏడాది చివరి నాటికి చైనా బిలియనీర్ల సంఖ్య 1,058కి చేరుకుంది. 696 మంది బిలియనీర్లతో అమెరికా రెండో స్థానంలో ఉంది.

ఏ నగరం నుంచి ఎంత మంది..?

ముంబై	60
ఢిల్లీ	40
బెంగళూరు	22
హైదరాబాద్	10

ఏ రంగం నుంచి ఎంత మంది..?

హెల్త్‌కేర్	37
కన్స్యూమర్ గూడ్స్	27
రసాయనాలు	19
సాఫ్ట్‌వేర్ సేవలు	14
ఆటోమొబైల్	13

ప్రపంచ టాప్-10 కుబేరుల జాబితా

ర్యాంకింగ్	పేరు	కంపెనీ	ఆస్తి (రూ.లక్షల కోట్లు)
1	ఎలాన్ మస్క్	టెస్లా	14.41
2	జెఫ్ బెజోస్	అమెజాన్	13.82
3	బెర్నార్డ్ అర్నాల్ట్	ఎల్‌వీఎంహెచ్	8.34
4	బిల్‌గేట్స్	మైక్రోసాఫ్ట్	8.04
5	మార్క్ జుకెర్‌బర్గ్	ఫేస్‌బుక్	7.38
6	వారెన్ బఫెట్	బెర్క్‌షైర్ హాత్‌వే	6.65
7	జాంగ్ షాన్షాన్	వైఎస్‌టీ	6.21
8	ముకేశ్ అంబానీ	రిలయన్స్	6.05
9	స్టీవ్ బామర్	మైక్రోసాఫ్ట్	5.85
9	బెర్నార్డ్ ఫ్యూచ్	హెర్మేస్	5.85

హైదరాబాద్‌లో 'సెటిల్' కో-లివింగ్ సేవలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఉద్యోగులు, విద్యార్థులకు వసతి కల్పన సేవలందిస్తున్న సెటిల్ కంపెనీ హైదరాబాద్‌లో కార్యకలాపాలను ప్రారంభించింది. హైదరాబాద్‌లో తొలి భవనంలో కార్యకలాపాలు ప్రారంభించామని, ఈ ఏడాది మే నాటికి ఐదు భవనాల నిర్వహణను చేపడతామని సెటిల్ వ్యవస్థాపకులు అశోక్ రెడ్డి, భారత్ భాస్కర్, అభిషేక్ త్రిపాఠి తెలిపారు. వచ్చే 12-15 నెలల్లో హైదరాబాద్, బెంగళూరుల్లో 2,500 పడకలను నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. సంస్థ ఇప్పటికే బెంగళూరులో కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

మళ్లీ 50,000కు సెన్సెక్స్

ముంబై : దేశీయ స్టాక్ మార్కెట్లో వరుసగా రెండో రోజూ ర్యాలీ కొనసాగింది. దీంతో సెన్సెక్స్ మళ్లీ కీలకమైన 50,000 పాయింట్లపైన ముగిసింది. ఆటో, ఐటీ కంపెనీల షేర్ల మద్దతుతో సెన్సెక్స్ ఇంట్రాడేలో ఒక దశలో 633 పాయింట్లు దూసుకుపోయింది. చివరికి 447.05 పాయింట్ల లాభంతో సెన్సెక్స్ 50,296.89 వద్ద ముగియగా నిఫ్టీ 157.55 పాయింట్ల లాభంతో 14,919.10 దగ్గర క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల షేర్లలో 25 కంపెనీల షేర్లు లాభాలతో ముగిశాయి.

రూ.45,000 దిగువకు పసిడి

బులియన్ మార్కెట్ మంగళవారం మరోసారి చతికిలపడింది. దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల మేలిమి (24 కేరట్స్) బంగారం ధర రూ.679 తగ్గి రూ.44,760 వద్ద ముగిసింది. కిలో వెండి ధర ఏకంగా రూ.1,847 తగ్గి రూ.67,073కు చేరింది. ముంబై బులియన్ మార్కెట్లో పది గ్రాముల స్వచ్ఛమైన బంగారం రూ.457 క్షీణించి రూ.45,509 వద్ద ముగియగా కిలో వెండి రూ.1,113 తగ్గి రూ.67,353 వద్ద క్లోజైంది.

ఎగుమతుల్లో స్వల్ప క్షీణత

న్యూఢిల్లీ : వరుసగా రెండు నెలల పాటు వృద్ధిని నమోదు చేసిన ఎగుమతుల రంగం ఫిబ్రవరి నెలలో స్వల్ప క్షీణత చవి చూసింది. కేంద్ర వాణిజ్య శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఫిబ్రవరిలో ఎగుమతులు 0.25 శాతం క్షీణించి 2767 కోట్ల డాలర్లకు (రూ.2.08 లక్షల కోట్లు) తగ్గాయి. వాణిజ్య లోటు 1288 కోట్ల డాలర్లకు (రూ.96,600 కోట్లు) పెరిగింది. ఇదే నెలలో దిగుమతులు 6.98 శాతం పెరిగి 4055 కోట్ల డాలర్లుగా (రూ.3.04 లక్షల కోట్లు) నమోదయ్యాయి.

నేటి నుంచి ఎంటీఏఆర్ ఇష్యూ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నేటి నుంచి ఎంటీఏఆర్ టెక్నాలజీస్ పబ్లిక్ ఇష్యూ ప్రారంభం కానుంది. 5న ముగుస్తుంది. షేర్ల కోసం దరఖాస్తుకు ధర శ్రేణిని రూ.574-575గా నిర్ణయించింది. కాగా కంపెనీలో యాంకర్ ఇన్వెస్టర్లు రూ.179 కోట్ల పెట్టుబడులు పెట్టారు. 31.11 లక్షల షేర్లను 15 మంది యాంకర్ ఇన్వెస్టర్లకు కేటాయించారు. ఒక్కో షేరు రూ.575కు ఈ షేర్లను విక్రయించారు.

స్పెక్ట్రమ్ వేలం అదుర్స్

ఖజానాకు రూ.77,815 కోట్లు

రిలయన్స్ జియోనే టాప్ బిడ్డర్

22 సర్కిల్స్‌కు రూ.57,123 కోట్లు

న్యూఢిల్లీ : స్పెక్ట్రమ్ వేలానికి టెలికాం సంస్థల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ వేలం మంగళవారం ముగిసింది. ఈ వేలంలో 3జీ, 4జీ స్పెక్ట్రమ్ కోసం రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా కంపెనీలు పోటీపడ్డాయి. ఇందుకోసం రూ.77,814.80 కోట్ల విలువైన బిడ్స్ సమర్పించాయి. ఈ బిడ్డింగ్‌లోనూ రిలయన్స్ జియోదే అగ్రస్థానం. ఈ కంపెనీ దేశంలోని 22 టెలికాం సర్కిల్స్‌లో స్పెక్ట్రమ్ కోసం రూ.57,122.65 కోట్లు చెల్లించేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ప్రభుత్వం ఈ బిడ్‌ను అంగీకరిస్తే కంపెనీ చేతిలో ఉండే స్పెక్ట్రమ్ 55 శాతం పెరిగి 1717 మెగాహెర్ట్జ్‌కు పెరుగుతుంది. ఈ వేలంలో భారతీ ఎయిర్‌టెల్ రూ.18,698.7 కోట్లు, వొడాఫోన్ ఐడియా రూ.1,993.40 కోట్లతో స్పెక్ట్రమ్ కొనుగోలు చేశాయి. కాగా ఈ వేలం ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం రూ.19,000-20,000 కోట్లు అందుకోవచ్చని అంచనా. కాగా వచ్చే ఆర్థిక సంవత్సరం (2021-22)లో మరో రూ. 6,000-రూ.7,000 కోట్ల వరకు ప్రభుత్వం అందుకునే వీలుంది.

మహిళా సాధికారితకు 'ఫినోలెక్స్' చేయూత

హైదరాబాద్ : ఫినోలెక్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఎఫ్ఐఎల్) మహిళా సాధికారిత కోసం కృషి చేస్తోంది. కంపెనీ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమం కింద ముకుల్ మాధవ్ ఫౌండేషన్ (ఎంఎంఎఫ్)తో కలిసి ఇందుకోసం పలు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 2019లో మహారాష్ట్రలోని ఉస్మానాబాద్ జిల్లాలో భర్తలను కోల్పోయిన 312 మహిళా రైతులకు ఉత్తమ సాగు పద్ధతులు, భూసార పరీక్షలు, చేతికొచ్చిన పంటలను మంచి ధరకు ఎలా అమ్ముకోవాలనే అంశాలపై శిక్షణ ఇచ్చింది. దీంతో ప్రస్తుతం ఉస్మానాబాద్ జిల్లాలోని 60 శాతం మహిళా రైతులు తమ అప్పులు తీర్చుకోవడంతో పాటు పిల్లల్ని చక్కగా చదివించుకోగలుగుతున్నారు. ఇదికాకుండా స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంతో కలిసి కొంతమంది మహిళా రైతులకు ఉచితంగా 30 కిలోల చొప్పున సోయా, 15 కిలోల చొప్పున కంది విత్తనాలు అందించింది. మహారాష్ట్రలోనే బీఎఎస్ఎల్‌డీ అనే సంస్థతో కలిసి వంద మంది మహిళా రైతులకు వ్యవసాయ యాంత్రికీకరణ, దిగుబడులు పెంచడంలో శిక్షణ ఇచ్చింది. ఈ వంద మంది ఇప్పుడు మరో వెయ్యి మంది మహిళా రైతులకు శిక్షణ ఇస్తున్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

2వ తేదీకి.. హైదరాబాద్	375	విజయవాడ	395
3వ తేదీకి.. చిత్తూరు	423	విశాఖపట్నం	400
గోదావరి	385	వరంగల్	377
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	95	గోదావరి	100
వరంగల్	95	విజయవాడ	100
మహబూబ్‌నగర్	95	గుంటూరు	100
కరీంనగర్	95	ఒంగోలు	100
కర్నూలు	95	చిత్తూరు	106
విశాఖపట్నం	100	నెల్లూరు	106

స్పోర్ట్స్

పెళ్లి కోసమే బుమ్రా సెలవు!

న్యూఢిల్లీ: భారత పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా త్వరలోనే పెళ్లి పీటలెక్కనున్నాడు. దీంట్లో భాగంగానే అతడు చివరి టెస్టుకు దూరమైనట్టు సమాచారం. వ్యక్తిగత కారణాలతో నాలుగో టెస్టుకు అందుబాటులో ఉండనని బుమ్రా ఇదివరకే బోర్డు దగ్గర అనుమతి కూడా తీసుకున్నాడు. 'త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నట్టు బీసీసీఐకి బుమ్రా తెలిపాడు. వివాహ ఏర్పాట్ల కోసం తగిన సమయం కావాలి కాబట్టే జట్టుకు దూరమయ్యాడు' అని బోర్డు అధికారి ఒకరు తెలిపాడు.

సాత్విక్ జోడీ ఘన బోణీ

స్విస్ ఓపెన్

బాసెల్ (స్విట్జర్లాండ్): తెలుగు యువ షట్లర్ సాత్విక్ సాయిరాజ్ స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ముందంజ వేశాడు. మంగళవారం ప్రారంభమైన ఈ టోర్నీలో మిక్స్‌డ్ డబుల్స్‌లో సాత్విక్-అశ్వినీ పొన్నప్ప జోడీ 21-18, 21-10తో ఇండోనేసియాకు చెందిన రెండోసీడ్ హఫీజ్ ఫైజల్-గ్లోరియా ఎమ్మాన్యుయెల్ జంటను చిత్తుచేసి రెండో రౌండ్‌కు దూసుకెళ్లింది. మరో భారత ద్వయం ప్రణవ్ చోప్రా-సిక్కి రెడ్డి 18-21, 15-21తో ఇంగ్లండ్‌కు చెందిన మూడోసీడ్ మార్కస్ ఎలిస్-లారెన్ స్మిత్ జోడీ చేతిలో ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. సింగిల్స్ స్టార్లు పీవీ సింధు, సైనా నెహ్వాల్, కిడాంబి శ్రీకాంత్ తమ తొలిరౌండ్ మ్యాచ్‌లను బుధవారం ఆడనున్నారు.

ఉమేశ్, కుల్దీప్‌లకు చాన్స్!

అహ్మదాబాద్: ఇంగ్లండ్‌తో మూడో టెస్టులో భారత్ 10 వికెట్లతో ఘనవిజయం సాధించినా.. చర్చంతా పిచ్ చుట్టూనే సాగింది. అయితే చివరిదైన నాలుగో టెస్టు కోసం మళ్లీ టర్నింగ్ వికెట్‌ను రూపొందించేందుకు బీసీసీఐ సుముఖంగా లేదు. దీనికి రెండు కారణాలున్నాయి. గులాబీ టెస్టులో స్పిన్నర్లు లీచ్, రూట్ బౌలింగ్‌లో భారత బ్యాట్స్‌మెన్ తొలి ఇన్నింగ్స్‌లో ఇబ్బంది పడ్డారు. డబ్ల్యూటీసీ ఫైనల్‌ను దృష్టిలో పెట్టుకుని భారత్ ఇప్పుడు ఎలాంటి రిస్క్ తీసుకోవాలనుకోవడం లేదు. అలాగే వరుసగా రెండు కఠిన పిచ్‌లను రూపొందిస్తే ఐసీసీ, బీసీసీఐ మధ్య విభేదాలు నెలకొనే అవకాశం ఉందని స్టేడియం నిర్వాహకులు భావిస్తున్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని నాలుగో టెస్టు వికెట్ బ్యాటింగ్‌కు అనుకూలించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

గిల్ స్థానంలో మయాంక్.. సుందర్ స్థానంలో కుల్దీప్

ఓపెనర్ శుభ్‌మన్ గిల్ ఇటీవలి ఇన్నింగ్స్‌లో ఆకట్టుకోలేకపోతున్నాడు. అతడి స్థానంలో మయాంక్ అగర్వాల్‌ను ఆడించవచ్చు. మయాంక్ మూడు శతకాలు స్వదేశంలోనే రావడం విశేషం. బుమ్రా గైర్హాజరీతో పేసర్ ఉమేశ్ యాదవ్ జట్టులోకి రావొచ్చు. 2018 నుంచి ఇక్కడ ఆడిన 7 టెస్టుల్లో ఉమేశ్ 38 వికెట్లు సాధించాడు. స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్ బౌలర్ కన్నా బ్యాట్స్‌మన్‌గా ఎక్కువ పేరు తెచ్చుకుంటున్నాడు. దీంతో అతడి స్థానాన్ని కుల్దీప్ భర్తీ చేయొచ్చు.

రేసులోకి హైదరాబాద్!

- ● ముంబైపై వెనక్కి ● కరోనా ఉధృతే కారణం
- ● ఐపీఎల్ వేదికపై పునరాలోచన

ముంబై: ఈ ఏడాది ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) సీజన్‌ను కచ్చితంగా భారత్‌లోనే నిర్వహించాలని బీసీసీఐ పట్టుదలగా ఉంది. ఇందుకోసం ఇటీవలే ప్రాథమికంగా ముంబైతో కూడిన ఆరు వేదికలను కూడా ఖరారు చేసింది. అయితే మహారాష్ట్రలో కరోనా కేసులు పెరుగుతుండడంతో బోర్డు పునరాలోచనలో పడింది. దేశంలో నమోదవుతున్న కేసుల్లో సగం ఈ రాష్ట్రంలోనే వెలుగు చూస్తుండడం వారిని ఆందోళనకు గురి చేస్తోంది. ఈ కారణంగా ఐపీఎల్ చరిత్రలోనే తొలిసారిగా ఇక్కడ మ్యాచ్‌లు జరగకపోవచ్చని సమాచారం. అదే జరిగితే డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్‌కు తమ సొంత మైదానంలో ఆడే అవకాశం కోల్పోయినట్టే. వాస్తవానికి లీగ్ మ్యాచ్‌లను ముంబై, పుణెలలో జరిపించి నాకౌట్ దశను అహ్మదాబాద్‌లో పూర్తి చేయాలని గతంలో భావించారు.

హైదరాబాద్‌కు చాన్స్!

గత వారం బీసీసీఐ కార్యదర్శి జై షా, కోశాధికారి అరుణ్ ధూమల్, తాత్కాలిక సీఈవో హేమంగ్ అమిన్, ఐపీఎల్ పాలకమండలి చైర్మన్ బ్రిజేష్ పటేల్ కలిసి వేదికలపై చర్చించారు. అనంతరం చెన్నై, బెంగళూరు, ముంబై, కోల్‌కతా, అహ్మదాబాద్, ఢిల్లీ వేదికలను ప్రాథమికంగా ఎంపిక చేసింది. ముంబైలో కేసులున్నా ప్రేక్షకులు లేకుండా మ్యాచ్‌లను జరిపించేందుకు అక్కడి ప్రభుత్వం అంగీకరించినట్టు వార్తలు వినిపించాయి. అయితే వేదికల్లో హైదరాబాద్ పేరు లేకపోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. అటు తెలంగాణ మంత్రి కేటీఆర్ సైతం ఉప్పల్‌లో మ్యాచ్‌లను జరిపించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో ఎన్నికలు లేకపోవడంతో పాటు కరోనా కేసులు కూడా అత్యల్పంగా ఉన్నాయని సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ కూడా గుర్తుచేసింది. అయితే ఇప్పుడు ముంబైపై బోర్డు వెనక్కి తగ్గుతున్న నేపథ్యంలో ఆ స్థానంలో హైదరాబాద్‌ను చేర్చే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

ఫ్రాంచైజీల అసంతృప్తి

వేదికల్లో మొహాలీ, జైపూర్‌లను విస్మరించడంపైనా విమర్శలు వినిపిస్తున్నాయి. తమకు స్థానిక అనుకూలత లభించదనే ఆందోళన ఆయా జట్లు వ్యక్తం చేశాయి. కొన్ని రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్నా మ్యాచ్‌లు జరిపేందుకు నిర్ణయించారని ఆరోపించాయి. అసలు ఏ ప్రాతిపదికన ఈ వేదికలను ఖరారు చేశారని ఇప్పటికే పంజాబ్ కింగ్స్ సహ యజమాని నెస్‌వాడియా బోర్డుకు లేఖ రాశాడు. అలాగే వ్యాపార పరంగానూ తమకు నష్టం చేకూరుతుందని ఫ్రాంచైజీలు ఆందోళన చెందుతున్నాయి. దీనికి తోడు లీగ్ సమీపిస్తున్నా ఇంకా వేదికలు, షెడ్యూల్‌పై తుది నిర్ణయానికి రాకపోవడంపైనా అసంతృప్తితో ఉన్నాయి. మరోవైపు త్వరలోనే ఐపీఎల్ పాలకమండలి, బీసీసీఐ కలిసి అందరి సందేహాలను నివృత్తి చేస్తూ తుది నిర్ణయం తీసుకోనున్నాయి.

జ్యోతి సురేఖ సరికొత్త రికార్డు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలుగమ్మాయి, అంతర్జాతీయ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ.. ఏప్రిల్‌లో జరిగే ఆర్చరీ వరల్డ్ కప్ కోసం నిర్వహించిన సెలెక్షన్ ట్రయల్స్‌లో అద్భుత ప్రదర్శన చేసింది. హరియాణాలోని సోనేపట్‌లో మంగళవారం ముగిసిన ఈ ట్రయల్స్‌లో మహిళల వ్యక్తిగత కాంపౌండ్ ఈవెంట్ ర్యాంకింగ్ రౌండ్‌లో సురేఖ 720కి గాను 710 పాయింట్లు స్కోరు చేసి సరికొత్త జాతీయ రికార్డు నెలకొల్పింది. ఈ క్రమంలో గతేడాది తానే నమోదుచేసిన రికార్డు (709/720)ను బద్దలుకొట్టింది. రౌండ్‌రాబిన్‌లో మొత్తం ఏడు మ్యాచ్‌లు నెగ్గి టాప్‌లో నిలిచిన సురేఖ.. వరల్డ్ కప్ జట్టులో చోటు దక్కించుకుంది.

మళ్లీ వచ్చేసింది ఇండో-పాక్ ఎక్స్‌ప్రెస్

'మెక్సికో'లో ఖురేషీతో కలిసి ఆడనున్న బోపన్న

న్యూఢిల్లీ: రోహన్ బోపన్న-ఐసమ్ ఉల్ హక్ ఖురేషీ జోడీ గుర్తుందిగా! ప్రపంచ టెన్నిస్‌లో ఇండో-పాక్ ఎక్స్‌ప్రెస్‌గా ఖ్యాతికెక్కిన ఈ ఇద్దరూ జంటగా పురుషుల డబుల్స్‌లో ఎన్నో మధురమైన విజయాలు అందుకున్నారు. ఇరుదేశాల మధ్య సంబంధాలు ఎలా ఉన్నా, కలిసి ఆడి 2010లో విజయవంతమైన డబుల్స్ జోడీగా పేరుతెచ్చుకొని క్రీడాస్ఫూర్తిని చాటారు. చివరిగా 2014 (షెన్‌జెన్ టోర్నీ)లో కలిసి ఆడిన ఇద్దరూ.. ఇన్నాళ్ల తర్వాత మళ్లీ జత కడుతున్నారు. ఈనెల 15 నుంచి మెక్సికోలో జరిగే అకాపుల్కో ఏటీపీ 500 ఈవెంట్‌లో డబుల్స్ జోడీగా బరిలోకి దిగుతున్నారు. ఈ విషయాన్ని స్వయంగా బోపన్న వెల్లడించాడు. 'ప్రస్తుతానికైతే మెక్సికో ఈవెంట్‌లో కలిసి ఆడుతున్నాం. ముందు మరిన్ని టోర్నీల్లో జతకట్టేది లేనిదే ఇప్పుడే చెప్పలేను' అని 40 ఏళ్ల బోపన్న తెలిపాడు. బోపన్న, ఖురేషీ తమ కెరీర్‌లో అత్యుత్తమంగా 2010 యూఎస్ ఓపెన్‌లో డబుల్స్ ఫైనల్ చేరారు.

తొలి రోజు బౌలర్ల జోరు

అఫ్ఘాన్ 131 ఆలౌట్ ● జింబాబ్వే 133/5

అబుదాబి: రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా అఫ్ఘానిస్థాన్-జింబాబ్వే జట్ల మధ్య మంగళవారం మొదలైన ఆరంభ మ్యాచ్‌లో తొలి రోజు బౌలర్ల హవా కొనసాగింది. బ్లెసింగ్ ముజరబాని (4/48), విక్టర్ న్యూచి (3/34) విజృంభణతో.. అఫ్ఘాన్ తొలి ఇన్నింగ్స్‌లో 131 పరుగులకే కుప్పకూలింది. అఫ్సర్ జజాయ్ (37), ఇబ్రహీం జద్రాన్ (31) టాప్ స్కోరర్లు. డొనాల్డ్ తిరిపనో, సీన్ విలియమ్స్, సికిందర్ రజా తలో వికెట్ తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌లో ఆటచివరకు జింబాబ్వే 133/5 స్కోరు చేసింది. కెప్టెన్ విలియమ్స్ (54 బ్యాటింగ్) అర్ధ సెంచరీతో రాణించాడు. అమీర్ హంజా 4 వికెట్లు తీశాడు.

ఫైనల్ రౌండ్‌కు శ్రీజ

దోహా: తెలుగమ్మాయి ఆకుల శ్రీజ వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) కంటెండర్‌లో మహిళల సింగిల్స్ మెయిన్ డ్రాకు అడుగుదూరంలో నిలిచింది. దోహాలో జరుగుతున్న ఈ టోర్నీలో మహిళల సింగిల్స్ క్వాలిఫయర్స్‌లో స్టార్ క్రీడాకారిణి మనికా బాత్రాతో పాటు శ్రీజ ఫైనల్ రౌండ్‌కు దూసుకెళ్లింది. ప్రపంచ 150వ ర్యాంకరైన శ్రీజ గతరౌండ్లలో వరుసగా 87వ ర్యాంకర్ ఒరవాన్ పరనాంగ్ (థాయ్‌లాండ్), 74వ ర్యాంకర్ వెగా పౌలీనా (చిలీ)పై గెలుపొంది తుదిపోరులో నిలిచింది. ఫైనల్ రౌండ్లో రష్యాకు చెందిన మరియా తైలకోవాతో శ్రీజ అమీతుమీ తేల్చుకోనుంది. ఇదే విభాగంలో ఫైనల్ చేరిన మనిక మెయిన్ డ్రాలో చోటు కోసం గన్నా గపోనోవా (ఉక్రెయిన్)తో తలపడనుంది.

హుస్సాముద్దీన్ శుభారంభం

కాస్టెల్లాన్ (స్పెయిన్): బాక్సమ్ ఇంటర్నేషనల్ టోర్నీలో మంగళవారం ప్రకటించిన డ్రాలో ఆరుసార్లు వరల్డ్ చాంపియన్ మేరీకోమ్, ఆసియా గేమ్స్ స్వర్ణ పతక విజేత అమిత్ పంగల్‌తో సహా మొత్తం 12 మంది భారత బాక్సర్లు నేరుగా క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. ఇక తెలుగు కుర్రాడు మహ్మద్ హుస్సాముద్దీన్ టోర్నీలో శుభారంభం చేశాడు. తొలిరౌండ్లో స్థానిక బాక్సర్ జాన్ మాన్యుయెల్ టోరెస్‌ను హుస్సాముద్దీన్ చిత్తుచేసి తదుపరి బౌట్‌కు దూసుకెళ్లాడు.

మొతేరా పిచ్‌పై వాన్ అక్కసు

లండన్: భారత్ పిచ్‌లపై ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైకేల్ వాన్ తన అక్కసును వెళ్లగక్కుతూనే ఉన్నాడు. మూడో టెస్టు రెండు రోజుల్లోనే ముగియడంపై అసలది టెస్టు పిచ్ కానేకాదని, ఐసీసీ విచారణ జరపాలని అతడిప్పటికే డిమాండ్ చేశాడు. ఇక నాలుగో టెస్టు వికెట్‌పైనా వ్యంగ్య రీతిలో స్పందిస్తూ ఫొటోను షేర్ చేశాడు ఇందులో పూర్తిగా తవ్విన మట్టిపై నిలబడి ఉన్న వాన్ బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తూ కనిపించాడు. 'నాలుగో టెస్టు కోసం సన్నాహకాలు అద్భుతంగా జరుగుతున్నాయి' అంటూ కామెంట్ చేశాడు.

కొవిడ్ వ్యాక్సిన్ తీసుకున్న రవిశాస్త్రి

అహ్మదాబాద్: టీమిండియా చీఫ్ కోచ్ రవిశాస్త్రి కొవిడ్ వ్యాక్సిన్ తీసుకున్నాడు. స్థానిక అపోలో ఆసుపత్రిలో వ్యాక్సిన్ తొలి డోసు తీసుకున్నట్టు 58 ఏళ్ల శాస్త్రి వెల్లడించాడు. టీకా వేయించుకుంటున్న ఫొటోలను ట్విటర్‌లో షేర్ చేశాడు. తాను కూడా కొవిడ్ వ్యాక్సిన్ తీసుకున్నానంటూ టీమిండియా మాజీ క్రికెటర్, 69 ఏళ్ల మదన్‌లాల్ ట్వీట్ చేశాడు.